# తండ్రి కాంక్ష... సోదరుల అండ

## కూలీ ఇంట మెరిసిన శాస్త్రవేత్త



శాస్త్రవేత్త సత్యనారాయణ

న్యూస్‌టుడే-అనకాపల్లి, మునగపాక

**తనలా తన పిల్లలు కాకూడదని కూలిపని చేసే ఆ తండ్రి భావించాడు. సంతానంలో ఒక్కరైనా ఉన్నత విద్యావంతులు కావాలని కలలుగన్నాడు. ఆర్థిక పరిస్థితులు సంకల్పానికి అడ్డుకట్ట వేశాయి. తండ్రి మనసెరిగిన పెద్దపిల్లలిద్దరూ శ్రమించి తమ్ముడిని చదివించారు. ఇంకేముంది ఆ ఇంటి నుంచి ఓ భౌతిక శాస్త్రవేత్త తయారయ్యాడు. ప్రభుత్వ పాఠశాలలో చదివి దేశం గర్వించే స్థాయికి చేరిన భీశెట్టి సత్యనారాయణ విజయగాథ స్ఫూర్తిదాయకం.**

నాగులాపల్లికి చెందిన భీశెట్టి అచ్చయ్య, అప్పయ్యమ్మ దంపతులకు ఐదుగురు సంతానం. వీరిలో ముగ్గురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. సత్యనారాయణ అందిరిలో చిన్నవాడు. అచ్చయ్య దంపతులు కూలి పనిచేస్తూ పిల్లలను పోషించేవారు. బతకడమే కష్టమైనందున పిల్లలందరినీ చదివించడం ఆయనకు సాధ్యం కాలేదు. పెద్ద కొడుకు వెంకటరమణ అప్పటికే ఐదో తరగతి చదువుకున్నాడు. కుటుంబ పరిస్థితిని గమనించిన వెంకటరమణ చదువుకు స్వస్తిచెప్పి తండ్రికి అండగా నిలిచాడు. రెండో అబ్బాయి కూడా ఇంటి ఆర్థిక పరిస్థితిని గమనించి చదువు మానేశాడు. తండ్రితో కలిసి కూలీ పని చేస్తూ మిగిలిన పిల్లలను చదివించారు. తండ్రి కోరిక, అన్నదమ్ముల అండతో సత్యనారాయణ బాగా చదువుకుని శాస్త్రవేత్త అయ్యారు.

### ఇదీ విద్యాప్రస్థానం


ఒకటి నుంచి ఐదో తరగతి వరకు నాగులాపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సత్యనారాయణ చదివారు. ఆరు, ఏడు తరగతులు మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించారు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు గుంటూరు జిల్లా తాడికొండ గురుకుల పాఠశాలలో చదివాడు. అంతవరకు సాదాసీదాగా సాగిన చదువు అక్కడ మలుపు తిరిగింది. సైన్స్ పట్ల ఆసక్తి పెరిగింది. అప్పటి నుంచి దూసుకుపోయారు. అనంతపూర్ టి.ఎన్.టి.యు.లో ఇంజినీరింగ్, ముంబాయి ఐ.ఐ.టి.లో పి.హెచ్.డి. చేశారు. ప్రస్తుతం ముంబయిలో భౌతికశాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు.

### మలుపుతిప్పిన గురుకుల విద్య

గురుకుల పాఠశాలలో విద్యార్థుల పట్ల అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేవారని, విద్యతో పాటు దేశ,విదేశాలకు చెందిన ఎన్నో విషయాలు చేప్పేవారని సత్యనారాయణ చెప్పారు. తనకు సైన్స్ పట్ల ఆసక్తి పెరగడానికి ఇదే కారణమంటారు.

### నెట్రినో కనుగొంటాం

ఇండియన్ బేస్డ్ నెట్రినో అబ్జర్వేటరీ పేరుతో తమిళనాడులోని మదురై సమీపంలోని పొట్టిపురం వద్ద చేపడుతున్న పరిశోధనల్లో నెట్రినో కణాలను కనుగొంటామని సత్యనారాయణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ ప్రయోగాలకు భారత ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించిందన్నారు. మొత్తం మూడు బృందాలుగా ఏర్పడి ప్రయోగాలు చేస్తున్నామని ఒక బృందానికి తాను నాయకత్వం వహిస్తున్నానని చెప్పారు. అసలు బరువే లేదని అనుకొంటున్న నెట్రినో అతి చిన్న కణమన్నారు. దీని గుణాలు ఎలాఉంటాయో తెలుసుకొంటున్నామన్నారు. ఈ కణాలు వల్లే బ్లాక్ హోల్స్ ఎలా ఏర్పడతాయో తెలుసుకోవచ్చన్నారు. అంతరిక్షంలో ఎన్నో ప్రక్రియలకు ఈ కణం ద్వారా జవాబు లభిస్తుందన్నారు. సెకెన్‌లో బిలియనో వంతు కాలాన్ని కొలవగల ఆర్.పి.సి. అనే డిటెక్టర్లను తాము తయారు చేశామన్నారు. ఈ ప్రయోగం కోసం అత్యంత అధునాతనమైన ఎలక్ట్రానిక్ కంట్రోల్ వ్యవస్థను తాము డిజైన్ చేశామన్నారు.



ప్రయోగాల్లో నిమగ్నమైన సత్యనారాయణ(పాతచిత్రం)